గోల్కొండ ఆసుపత్రికి కాయకల్ప్ అవార్డు


వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాసరావు

గోల్కొండ: ఆసుపత్రి నిర్వహణ అత్యుత్తమంగా ఉన్నందు వల్లే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కాయకల్ప్ అవార్డు మన ఆసుపత్రికి వచ్చిందని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రికి కాయకల్ప్ అవార్డులో భాగంగా రూ.లక్ష నగదు బహుమతి వచ్చిన సందర్భంగా మంగళవారం ఆయన ఆసుపత్రిలో తోటి వైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్ పేషంట్స్ విభాగంతో పాటు ఇన్ పేషంట్ విభాగం, ఐసీయూ, డయాలసిస్ యూనిట్ తదితర విభాగాలను కేంద్ర ప్రభుత్వం ప్రతినిధి బృందం గత ఆగస్టులో ఆసుపత్రిని సందర్శించిందన్నారు. వైద్యుల అంకిత భావం, నర్సింగ్ సిబ్బంది సేవా భావానికి సైతం ప్రతినిధి బృందం ఎంతగానో మెచ్చుకుందన్నారు.

దానకిషోర్‌ను కలిసిన మజ్లిస్ ప్రతినిధి బృందం



గోల్కొండ: మజ్లిస్ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిషోర్‌ను కలిశారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా ప్రస్తుతం కూల్చివేతల కోసం చేస్తున్న పనులను ఆపాలని వారు దానకిషోర్‌ను కోరారు. 2003 సంవత్సరపు మూసీ సర్వే ప్రకారమే ఈ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ కోరారు. ప్రస్తుతం చేస్తున్న ఇళ్ల మార్కింగ్ ఏ పద్ధతిలో చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై సరైన వివరాలు లేవని ఈ సర్వేను ఎప్పుడు చేశారో తెలియకుండాపోతుందన్నారు. పురానాపూల్ నుంచి అత్తాపూర్ వరకు గల మూసీ పరీవాహక ప్రాంతంలో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని పేద కుటుంబాలే ఈ ప్రాంతాల్లో నివసిస్తున్నాయన్నారు. దానకిషోర్‌ను కలిసిన వారిలో మజ్లిస్ ఎమ్మెల్యేలు అహ్మద్ బలాలా, మీర్ జుల్ఫీకార్, మహ్మద్ ముబిన్ తదితరులున్నారు.

దైవభక్తితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

గోల్కొండ: దైవభక్తి విద్యార్థులను ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తుందని విశ్రాంత ఐపీఎస్ అధికారి అన్వర్ ఉల్ హుదా అన్నారు. టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ఆధ్వర్యంలో రాహే హిదాయత్ కార్యక్రమం నిర్వహించారు. క్విజ్, నాత్ పోటీల విజేతలకు మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దైవ భక్తితో మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత కూడా సాధించగలుగుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వీనస్ విద్యా సంస్థ డైరెక్టర్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ పాల్గొన్నారు.

బాపూ.. నీ యాదిలో..

- 1948 ఫిబ్రవరి 9న బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు గాంధీజీ అస్థికలు
- 12న ర్యాలీగా లంగర్‌హౌస్ త్రివేణి సంగంకు తరలింపు
- మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం

లంగర్‌హౌస్: శాంతి, అహింస అనే గొప్ప ఆయుధాలను ప్రపంచానికి అందించిన మహాత్ముడు జాతిపిత మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ జయంతి నేడు. ఆయన జయంతి పురస్కరించుకొని దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక సమాధి అయిన లంగర్‌హౌస్‌లోని త్రివేణి సంగం వద్ద ఉన్న బాపూఘాట్ ముస్తాబయ్యింది.

దేశంలోని ఐదు ప్రధాన ప్రాంతాల్లో..

బాపూజీ మరణానంతరం ఆయన అస్థికలను దేశంలోని ఐదు ప్రధాన ప్రాంతాలతో పాటు ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. దక్షిణ భారతదేశంలో కేవలం ఒకే ఒక ప్రాంతాన్ని ఎంచుకున్నారు. గాంధీజీ శిష్యురాలు, సర్వోదయ ఉద్యమ నాయకురాలు, గాంధీ స్మృతి అధ్యక్షురాలు జ్ఞానకుమారి హెడా పట్టుబట్టి త్రివేణి సంగం చరిత్ర వివరించి గాంధీజీ అస్థికలు నగరానికి తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించారు. ఆ సమయంలో హైదరాబాద్ రాష్ట్రం నిజాం పరిపాలనలో ఉండడంతో నగరానికి అస్థికలు తీసుకురాడానికి కూడా ఇబ్బందిపడ్డారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కలుగజేసుకొని విషయాన్ని నిజాం నవాబుతో తెలపడంతో సంతోషంగా ఆహ్వానించారు. దీంతో కెఎమున్షి సమక్షంలో హరిశ్చంద్ర హెడా, జ్ఞాన కుమారి హెడా ఆధ్వర్యంలో అస్థికలను 1948 ఫిబ్రవరి 9న బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌కు తీసుకువచ్చారు. రెండు రోజులు ప్రజల సందర్శనార్థం అక్కడే పెట్టి 12న భారీ ర్యాలీగా లంగర్‌హౌస్ త్రివేణి సంగంకు తీసుకువచ్చారు. అక్కడ కొన్ని అస్థికలు కలశంలో పెట్టి సమాధి నిర్మించగా, మరి కొన్ని అస్థికలు త్రివేణి సంగంలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దివంగత స్వాతంత్ర సమరయోధులు బాపు వెంకటరమణ దగ్గరుండి ఆయన హస్తాలతో సమాధి తవ్వారు.


మూడంతస్తుల బావి వద్ద ప్రార్థనల్లో జ్ఞానకుమారి హెడా (ఫైల్)

బాపూస్మృతి ఆధ్వర్యంలో..

త్రివేణి సంగం ఒడ్డున సమాధి ఏర్పాటు చేశాక అక్కడ అడవిలో వెళ్లడానికి ఇబ్బంది పడి ప్రస్తుత బాపూధ్యాన మందిరం వద్ద ఉన్న సంగం రాంచంద్రజీ మఠానికి చెందిన మూడంతస్తుల లోతు ఉన్న బావి వద్ద ప్రతి సంవత్సరం ప్రార్థనలు నిర్వహించేవారు. జ్ఞానకుమారి హెడా ఆ సమయంలో బాపూ సమాధి పరిరక్షణ కోసం బాపూస్మృతి మాజీ అధ్యక్షుడు దివంగత బాబురావు వర్మ, సినిమా ఆర్టిస్టు సంఘ సేవకురాలు రాఘవమ్మ, నేటికి సేవలు అందిస్తున్న పరమానందంలకు బాధ్యత అప్పగించింది. అయితే ఇక్కడి సమస్యను పరమానందం తన బావ అయిన అప్పటి కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ వి. హనుమంతరావుకు వివరించగా ఆయన ఆదేశాలతో ఇప్పటి పీసీసీ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్‌రావు అక్కడ సమాధిని పటిష్టంగా నిర్మించారు.

దక్షిణ భారతంలో ఇక్కడే ఎందుకు..

లంగర్‌హౌస్ త్రివేణి సంగమాన్ని దక్షిణ కాశీ అని కూడా అంటారు. కొడంగల్ గుట్టల నుంచి వచ్చే హిమగంగ, అనంతగిరి గుట్టల నుంచి వచ్చే ముచుకుంద, గుప్త గంగ మూడు నదుల కలయిక ఈ పవిత్ర త్రివేణి సంగం. మరణించిన వారి అస్థికలను త్రివేణి సంగంలో నిమజ్జనం చేస్తే అవి రాళ్లలా మారడంతో వారి ఆత్మ శాంతిస్తుందని స్థల పురాణం. దీంతో దక్షిణ భారతదేశంలో గాంధీజీ అస్థికలు కలపడానికి ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, వాజ్‌పాయి, ఎన్టీరామారావు, మర్రి చెన్నారెడ్డి, ఆర్మీ అమర వీరులతో పాటు అనేక ప్రముఖుల అస్థికలను ఇక్కడ నిమజ్జనం చేశారు.


సమాధి నిర్మాణం తర్వాత నివాళులర్పిస్తున్న హెడా, రాఘవమ్మ, పరమానందం (ఫైల్)

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



లంగర్‌హౌస్: అందరం బాధ్యతాయుతంగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ట్రాఫిక్ నియమాలపై వాహనదారుల్లో అవగాహన కల్పిస్తూ, వారిలో చైతన్యం నింపేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులతో కూడళ్ల వద్ద చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు వాహనదారులతో అందరం ఇంటికి క్షేమంగా చేరేందుకు కచ్చితంగా నియమాలు పాటించాలని వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సై అశోక్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి 15 రోజుల జైలు శిక్ష పడిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన ఎస్.అరుణ్ (20) భవానీనగర్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో పోలీసులు అరుణ్‌ను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసుకొని మంగళవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతిరావు అరుణ్‌కు 15 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

చంద్రకిరణ్ బస్తీవాసులకు డబుల్‌బెడ్‌రూమ్‌ల కేటాయింపు


డబుల్‌బెడ్‌రూమ్‌లను కేటాయిస్తున్న నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్

అఫ్జల్‌గంజ్: ధూల్‌పేట చంద్రకిరణ్ బస్తీకి చెందిన 10 మందికి జియాగూడలోని డబుల్‌బెడ్‌రూమ్‌లను కేటాయించారు. మంగళవారం నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్ వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పత్రాలను అందజేశారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీ ఒడ్డున ఉన్న వారికి జియాగూడలోని డబుల్‌బెడ్‌రూమ్‌ల ఇండ్ల సముదాయంలో ఇళ్ల పత్రాలను అందజేసి ఇళ్లను షిఫ్ట్ చేస్తున్నామని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ వివరించారు. ఇప్పటి వరకు నాంపల్లి మండల పరిధిలో 21 మంది మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసించే వారికి డబుల్‌బెడ్‌రూమ్‌లు కేటాయించి వారి ఇళ్లను షిఫ్ట్ చేశామని వెల్లడించారు.

బీజేపీ దొంగ దీక్షలను రైతన్నలు నమ్మరు'


గడ్డం శేఖర్‌యాదవ్

అబిడ్స్: రైతులను దగా, మోసం చేస్తున్న బీజేపీ నాయకులు తమ దొంగ దీక్షలను రైతన్నలు నమ్మరని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ నాయకుడు, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు ఎన్నో కష్టాలు పడితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల కోసం రైతు రుణమాఫీ చేసిందన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో శేఖర్ యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ..దేశంలోని పలు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని, ఏ రాష్ట్రంలోనైనా రైతుల రుణాలు బీజేపీ మాఫీ చేసిందా అని ప్రశ్నించారు. రైతుల కోసం బీజేపీ రాష్ట్ర నాయకులు దొంగ డ్రామాలు ఆడుతూ దొంగ దీక్షలు చేస్తే గ్రామాల్లో రైతులంతా బీజేపీని ఛీ కొడుతున్నారని శేఖర్‌యాదవ్ అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలలా కాంగ్రెస్‌దే విజయమన్నారు.

హెచ్‌జీఎఫ్ అండర్-14 గేమ్స్ ప్రారంభం


క్రీడాకారులతో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: నైపుణ్యంతోనే ఏదైనా సాధించవచ్చునని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం గోల్కొండ ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో హైదరాబాద్ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ పోటీలను మొదటిసారిగా గోల్కొండలో నిర్వహిస్తున్నారని దీన్ని వల్ల స్థానిక యువ క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. మంచి కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకుంటే యువ క్రీడాకారులు అద్భుతాలు సాధిస్తారన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్ పాషా తదితరులున్నారు.

నవంబర్ 8న నిజాం కళాశాల గ్రాడ్యుయేషన్ డే


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ భీమా తదితరులు

గన్‌ఫౌండ్రీ: నవంబర్ 8న నిజాం కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.భీమా తెలిపారు. మంగళవారం కళాశాల అధికారులతో కలిసి గ్రాడ్యుయేషన్ డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..23 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలు ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఓయూ వీసీతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.రాములు, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ హిమబిందు, నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్‌రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎస్.రేణుకా తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయకు ఆహ్వానం

అఫ్జల్‌గంజ్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే రామాయణ మేళా రావణ దహన వేడుకలకు పాల్గొనాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు రామాయణ మేళా చీఫ్ కన్వీనర్ కోవింద్‌రాఠీ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మంగళవారం దత్తాత్రేయను కలిసి అక్టోబర్ 12న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున రామాయణ మేళా, రావణ దహనం వేడుకలు నిర్వహిస్తామన్నారు. దత్తాత్రేయ తప్పక వస్తానని హామీ ఇచ్చారు.


గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న గోవింద్‌రాఠి

అన్నదానం

చార్మినార్: అశోక్ ఫౌండేషన్ హైదరాబాద్ అగర్వాల్ కుంభమేళా ఆధ్వర్యంలో పాతబస్తీ రికాబ్‌గంజ్‌లోని కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చిన్న వ్యాపారులకు 'తక్ష ఎక్స్ ఆన్‌లైన్' సేవలు భేష్


లైట్స్ గో ఆన్‌లైన్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న జయేష్ రంజన్ తదితరులు

అబిడ్స్: చిన్న వ్యాపారులకు 'తక్ష ఎక్స్ ఆన్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్'ఏడాది పాటు ఉచితంగా సేవలు అందించడం ఎంతో గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పేర్కొన్నారు. తక్ష ఎక్స్ ఆన్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు జై తపాడియా, విజయ్ తపాడియా, అనిల్ మాల్‌పానిల ఆధ్వర్యంలో లెట్స్ గో ఆన్‌లైన్ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ..సాంకేతిక పరిజ్ఞానం చిన్నా చితకా వ్యాపారులకు కూడా ఆధునిక యుగంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిర్వాహకులు జై తపాడియా, విజయ్‌తపాడియా, అనిల్ మాల్‌పానీ మాట్లాడుతూ..నగరంలో ఉన్న పలు కళాశాలల్లో తాము ఒప్పందం చేసుకొని విద్యార్థులను సైతం భాగస్వామిలను చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తోష్ణివాల్, మహేశ్వరీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మంత్రివర్గ ఉప సంఘాన్ని రద్దుచేయాలి


మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన మాల సంఘాల నేతలు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో ఇటీవల ఎస్సీ వర్గీకరణ మీద అధ్యయనం చేయడానికి వేసిన మంత్రివర్గ ఉప సంఘాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్‌లు బేరా బాలకిషన్, బూర్గుల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరాజు, కన కరాజులు డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేవలం కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకుగా ఉన్న 50 లక్షల మంది మాలలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేయాలనే కుట్ర జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మందకృష్ణను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని బీజేపీ వర్గీకరణ నాటకం ఆడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్ధం కిషోర్, సుధీర్ నామ్‌దేవ్, సత్యనారాయణ, రాంచందర్, వినోద్ పాల్గొన్నారు.

3 నుంచి నల్లపోచమ్మ, తుల్జాభవాని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు

జియాగూడ: జియాగూడ సంజయ్‌నగర్ నల్లపోచమ్మ, తుల్జాభవాని ఉమ్మడి ఆలయాల్లో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన ఆలయంలో మాట్లాడుతూ..ప్రతిరోజు ఆలయంలో రాత్రికి అఖండ హారతి, మహా అన్నదానం నిర్వహిస్తామన్నారు. అలాగే 7న ద హిమ భజన మండల్ గాయకుడు మురారి దాహిమా ఆధ్వర్యంలో మాతాక విశాల్ జాగరణ్ ఉంటుందన్నారు. ప్రతిరోజూ అమ్మవార్లకు బాల త్రిపుర సుందరీ దేవి, గాయత్రిదేవి, అన్నపూర్ణ దేవి, లలితా త్రిపుర సుందరీ దేవి, శాఖాంబరి దేవి, మహాలక్ష్మీదేవి, సరస్వతి దేవి, దుర్గాదేవి, మహిషాసుర మర్ధిని దేవి, రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పిస్తామన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

విజయనగర్‌కాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు మహోన్నతమైనవని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.మధుకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆలంగిరి రేణుకా అన్నారు. వేడుకల్లో భాగంగా సంగీత గీతాలాపనలు, దాండియా నృత్యాలు హుషారుగా, ఉల్లాసంగా కొనసాగాయి. ప్రభుత్వ ఫైనార్ట్స్, ఆర్కిటెక్చర్ కళాశాలల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.గంగాధర్, ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్‌లతో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే యూరో కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ, దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రాదారణలతో చిన్నారులు బతుకమ్మ వేడుకల్లో సందడి చేశారు.

కట్టెలమండి ఆంధ్రా విద్యాలయాలో..

అబిడ్స్: అబిడ్స్ కట్టెలమండిలోని ఆంధ్రా విద్యాలయ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలు మంగళవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలతో ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందుతున్నాయన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు హేమ, మంజుల, సునిత, జ్యోతి, ప్రియ, కవిత, సంగీత, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యాశ్రీ హైస్కూల్‌లో..

జియాగూడ: విద్యశ్రీ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. మంగళవారం స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ సునీత శ్యామ్‌వెరా ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. డైరెక్టర్ శ్యామ్‌వెరా మాట్లాడుతూ.. తెలంగాణ పండుగ బతుకమ్మ సంబరాలు ఎంతో విశిష్టత, విలువలతో జరుపుకోవాలని కోరారు.


అబిడ్స్ కట్టెలమండిలో..

అయోధ్యనగర్‌లో..

గౌలిపురా: అయోధ్యనగర్‌లోని ఛత్రినాక బ్రాంచ్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. మేనేజింగ్ డైరెక్టర్లు కె.తిరుమల రెడ్డి, జి.రామకృష్ణ యాదవ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


యూరో కిడ్స్ పాఠశాలలో చిన్నారులతో ఉపాధ్యాయులు


విద్యశ్రీ హైస్కూల్‌లో..ప్రిన్సిపల్ సునిత శ్యామ్‌వెరా


కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

చాంద్రాయణగుట్ట: దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఉప్పుగూడలోని కాళికామాత ఆలయం ముస్తాబయ్యింది. ప్రధాన ఆలయంలో పాటు ఆలయ ఆవరణలోని కోనేరు, ఆంజనేయ స్వామి ఆలయాలను రంగులతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకుంటేనే సగం ఆపద దూరమవుతుందని ప్రతీతి. దీంతో అమ్మవారిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు బారులు తీరుతారు. దేవీ శరన్నరాత్రులను పురస్కరించుకొని కాళికామాతను రోజుకో రూపంలో కొలుస్తుంటారు. వందల ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయంలో కాళికాదేవీ సాక్షాత్తు కొలువై ఉన్నట్లు మూల విరాట్ కనిపిస్తుంటుంది. శతాబ్దాల చరిత్ర గల ఈ ఆలయ నిర్మాణం సాధారణ ఆలయాల కంటే భిన్నంగా ఉంటుంది. ఆలయానికి గోపురం సైతం ఉండదు. దేవాలయ ప్రధాన అర్చకుడే ఆలయంలో అన్ని పూజలను నిర్వహిస్తుంటారు.

ఆలయ చరిత్ర..

ఉప్పుగూడ జెండా ప్రాంతంలో విశాలమైన పంట పొలాల మధ్య కాళికామాత ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో దూప దీప నైవేద్యాల కోసం దాదాపు 20 ఎకరాల పంట భూమిలో ఈ ఆలయం ఉండేది. ఆలయాన్ని భాస్కర్ పంతులు వంశస్థులు దశాబ్దాలుగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు భాగంలో కోనేరును నిర్మించారు. ఈ కోనేరులో స్నానం ఆచరించు భక్తులు కోనేరు పైగట్టునే ఉన్న కాళికాదేవిని దర్శించుకునేవారు. కోనేరులో నీటి ఊట ఎక్కువగా వచ్చినప్పుడు కాళికాదేవీని దర్శించే భాగ్యం కలిగేది కాదు. దీంతో పైభాగంలో నూతనంగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ కోనేరు కింది భాగం నుంచి పక్కనే ఉన్న నరసింహ స్వామి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయంతో పాటు స్థానికంగా ఉన్న ఏడు బావులకు దారి ఉందని స్థానికులు చెబుతుంటారు. ప్రస్తుతం ఈ కోనేరులో భక్తులు బతకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు. ఇక్కడ నవరాత్రోత్సవాల సందర్భంగా జాతర నిర్వహించేవారు. కాలక్రమంగా జాతర కాస్త కనుమరుగయ్యింది.


కాళికామాత అమ్మవారు

కోనేరు గట్టుపై ఉగ్రరూపంలో అమ్మవారు..

గతంలో కోనేరు గట్టుపై ఉన్న విశాల ప్రదేశంలో ఉగ్రరూపంలో ఉన్న కాళికాదేవీని పూజించేవారు. ఈ మాతకు రక్షణగా నాగేంద్రుడు (నాగ సర్పం) ఉండేవాడని స్థానికులు చెబుతుంటారు. ఉగ్ర రూపంలో ఉన్న ఈ అమ్మవారిని చూస్తే భక్తులు భయకంపితులయ్యేవారని, దీంతో పూజారులు కోనేరు పైభాగంలో ఆలయాన్ని నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠించారట. ఇప్పటికీ సైతం ఈ ఆలయ పరిసరాలలో నాగేంద్రుడు కలియతిరుగుతూ భక్తులకు దర్శనమిస్తుంటాడు.


ఉప్పుగూడలోని కాళికామాత ఆలయం